క్లుప్తంగా

విద్యార్థులకు వైద్య పరీక్షలు



ఊట్కూరు: మండలంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో గురువారం ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్ భవాని ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థుల ఎత్తు, బరువు, వ్యక్తిగత పరిశుభ్రత ఇతర ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యంతో ఉన్న విద్యార్థులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులు వ్యక్తి పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిపించారు. కార్యక్రమంలో వార్డెన్ జగదీశ్వర్‌రెడ్డి, వైద్యసిబ్బంది విజయ్‌కుమార్, నర్సింహులు, మణిమాల, శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

కృష్ణా: మక్తల్ నియోజకవర్గ కేంద్రానికి సివిల్, క్రిమినల్ కోర్టును తీసుకురావడంతో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మండల కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు.. మండల సీనియర్ నాయకుడు కృష్ణామూర్తి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు నారాయణలు మాట్లాడుతూ.. మక్తల్ పట్టణంలో కోర్టు ఏర్పాటు కావడంతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.

నాసిరక పనులపై చర్యలు తీసుకోవాలి

ధన్వాడ: మండలంలోని గోటూర్‌లో ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మాణం పనులు నాసిరకంగా చేస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని మాజీ సర్పంచ్ నాగేశ్వర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ వెంకట్‌రెడ్డి అన్నారు. ఇతర ప్రభుత్వ భవనం కూల్చివేసిన పాతరాయితో కంపౌండ్‌వాల్ నిర్మిస్తున్నారని, సరైనా క్యూరింగ్ కూడా చేయకపోవడంతో నిర్మాణం నాణ్యత తగ్గుతుందన్నారు. వెంటనే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

పాఠశాల నుంచి తప్పిపోయి.. తల్లిదండ్రుల చెంతకు



నారాయణపేట రూరల్: ప్రైవేట్ పాఠశాల నిర్వాహకుల నిర్లక్ష్యంతో ఓ చిన్నారి తప్పిపోయి పోలీసుల సాయంతో తల్లిదండ్రుల చెంతకు చేరింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని పేరపళ్లకు చెందిన ప్రమీళ, రాజు దంపతుల కూతురు ఆరాధ్యను స్థానిక ఓ ప్రైవేట పాఠశాలలో చదివిస్తున్నారు. అయితే పాఠశాల నిర్వాహకులు పర్యవేక్షణ లేక చిన్నారి ఆరాధ్య స్కూల్ నుంచి బయటకు వచ్చి సాయిబాబ ఆలయం వద్ద రోదిస్తూ నిల్చుంది. ఈ క్రమంలో అటుగా వచ్చిన భజరంగ్‌దళ్ కార్యకర్తలు బాలికతో మాట్లాడగా వివరాలు సరిగా చెప్పలేకపోయింది. దీంతో వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి అప్పగించారు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు బాలిక ఫొటోను సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో తండ్రికి చేరి వెంటనే పీఎస్‌కు చేరుకుని పాపను తీసుకెళ్లారు.

ద్విచక్రవాహనం అదుపు తప్పిఇద్దరికి గాయాలు

ఊట్కూర్: మండలంలోని కొల్లురు స్టేజ్ వద్ద గురువారం సాయంత్రం ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడడంతో ఇద్దరికి గాయాలైన సంఘటన చోటుచేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాలిలా.. పెద్దపోర్ల గ్రామానికి చెందిన మహేశ్, మల్లప్ప ద్విచక్రవాహనంపై ఊట్కూర్‌నుంచి తమ గ్రామానికి వెళ్తుండగా ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడింది. దీంతో ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో అక్కడే ఉన్న కొల్లూర్ మాజీ సర్పంచ్ సంవృద్ధి, కాంగ్రెస్ నాయకులు యగ్నేశ్వర్‌రెడ్డి 108కు సమాచారం అందించి అంబులెన్స్‌లో మక్తల్ ఆస్పత్రికి చికిత్సకోసం తరలించారు.

కళకళలాడుతున్న పత్తి పంట

మరికల్: వరుసగా కురుస్తున్న వర్షాలతో పత్తి రైతుల్లో అవిరైన ఆశలు సహజీవంగా నిలిచాయి. గత పక్షంరోజుల నుంచి అడపదడప ఓ మోస్తారుగా కురుస్తున్న వర్షాలతో పత్తి పంటలు కళకళలాడుతున్నాయి. దీంతో రైతులు పంటలకు ఫర్టిలైజర్, పిచికారి మందులను వేయడంలో నిమగ్నమయ్యారు. మండలంలో అత్యధికంగా ఈ ఏడాది 18వేల ఎకరాలకు పైగా పత్తి సాగుచేశారు. మొదట్లో ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో పంట పెరుగుదల లోపించింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పత్తితోపాటు ఇతర పంటలు కూడా ఊపిరి పోసుకున్నాయి.



అప్రమత్తతతోనే ప్రాణరక్షణ

- ఆదమరిస్తే అన్నదాతలకు పొంచి ఉన్న ప్రమాదం
- ట్రాక్టర్ల వినియోగం, విద్యుత్ మరమ్మతుల్లో జాగ్రత్త
- పాములు, విషపు పురుగుల సంచారం ఎక్కువే..



పొలంలో కేజీవీల్స్‌తో దున్నుతున్న రైతు

మాగనూర్: వానాకాలం మొదలైంది. రైతులు పొలం పనులకు శ్రీకారం చుట్టారు. మండలంలోని మొత్తం వ్యవసాయాధారితం కావడంతో రైతులు, వ్యవసాయ కూలీలు, దినసరి రైతు కూలీలు పొలం బాట పడుతున్నారు. అయితే పనుల్లో నిమగ్నమై చుట్టూ పరిసరాలను మరిచిపోతుంటారు. పాములు, విషపు పురుగులు సంచారం వర్షాకాలంలో ఎక్కువగా ఉంటుంది. మరోవైపు విద్యుత్ ప్రమాదాలు చోటుచేసుకుంటాయి. వ్యవసాయ పనులకు ఉపయోగించే వాహనాలను నడిపే సమయంలో అప్రమత్తంగా ఉండాలి. ఏటా వానాకాలంలో చిన్నచిన్న పొరపాట్లు, ఏమరపాటుతో విద్యుత్, ట్రాక్టర్ ప్రమాదాలు జరగడం, పాముకాటుతో రైతులు, కూలీలు చనిపోతున్నారు. ఇలాంటి ఘటనలు బాధిత కుటుంబాలకు తీరని దుఃఖం మిగుల్చుతోంది. ప్రస్తుతం వర్షాకాలం సాగు నేపథ్యంలో వ్యవసాయ అధికారులు పలు సూచనలు ఇస్తున్నారు.

పెరిగిన ట్రాక్టర్ల వినియోగం..

మండల పరిధిలో వర్షాకాలం పనులు ఊపందుకున్నాయి. రైతులు దుక్కులు దున్నడం, కల్టివేటర్ కొట్టడం, విత్తనాల సాళ్లు పెట్టడం తదితర పనులన్నీ ట్రాక్టర్లతోనే చేయిస్తున్నారు. వ్యవసాయ రంగంలో వీటి వినియోగం పెరిగింది. గతంలో రైతులు ఎద్దులు, నాగలి ఉపయోగించేవారు. ఇప్పుడు అందరూ ట్రాక్టర్లే వాడుతున్నారు. ఈ క్రమంలో యంత్రాల వినియోగంలో అనుభవరాహిత్యమో.. అ జాగ్రత్తతోనో ప్రమాదాల బారిన పడుతున్నారు.

- రైతులు కేజీవీల్స్ బదులు రోటోవేటర్‌తో భూమి చదును చేసుకుంటే మేలు. కేజీవీల్స్ భూమి లోపలికి ఎక్కువగా దిగుతుండటంతో నీరు వృథా అయ్యే అవకాశం ఉంది.
- అనుభవం ఉన్న డ్రైవర్లతోనే కేజీవీల్స్ ట్రాక్టర్లు నడిపించాలి. ట్రాక్టర్ ముందుభాగంలో బంపర్ వద్ద 150 కేజీల బరువు అమర్చడం మంచిది. దీంతో ట్రాక్టర్ గట్టు ఎక్కేటప్పుడు ముందు భాగం పైకి లేచి పల్టీకొట్టకుండా ఉంటుంది.
- ట్రాక్టర్ పొలంలో దిగబడితే కట్టెలు పెట్టి ముందుకు నడుపుతుంటారు. దీని ద్వారా ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి.
- కేజీవీల్స్ వెనుకల నాగళ్లు అమర్చుకోవడంతో పల్టీ కొట్టదు.
- ముందు టైర్లు నీటిలో పూర్తిగా మునగకుండా చూసుకోవాలి.
- కేజీవీల్స్‌తో రోడ్డుపై వెళ్తే కేసునమోదు చేస్తారు.

పాముకాటుతో గాలిలో కలుస్తున్న ప్రాణాలు..

వర్షాకాలంలో ఎక్కువ మంది రైతులు పాముకాటుకు గురవుతుంటారు. దీనికి మందులు ఉన్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. రాత్రి సమయాల్లో జాగ్రత్తగా వెళ్లకపోతే పాముకాటుకు గురి కావడం ఖాయం.

- వర్షకాలంలో వ్యవసాయ పనులకు వెళ్లేవారు తమ వెంట టార్చిలైట్ ఉంచుకోవాలి.
- కాళ్లకు బూట్లు లేదా కాలుపైభాగం వరకు కప్పి ఉంచే చెప్పులు ధరించాలి.
- చేతిలో కర్ర పట్టుకొని శబ్దం చేసుకుంటూ వెళ్లాలి.
- పాముకాటు వేస్తే భయపడకుండా ధైర్యంగా ఉండాలి.
- పాముకాటు వేసిన ప్రాంతం నుంచి పది ఇంచుల దూరంలో గట్టిగా తాడుతో గాని, చేతి రుమాలుతో గానీ గట్టిగా కట్టుకోవాలి.
- బాధితులను వెంటనే ఆస్పత్రికి తీసుకువెళ్లాలి.

అవగాహన లోపంతో..



రైతులకు సరైన అవగాహన కార్యక్రమాలు లేకపోవడంతోనే ప్రమాదాలకు గురవుతున్నారు. వ్యవసాయ అధికారులు రైతులకు సలహాలు, సూచనలు ఇస్తుండాలి. ప్రస్తుతానికి తగిన జాగ్రత్తలు తీసుకుని ఖరీఫ్ పనులు నిర్వహించుకుంటాం.

–అంజప్ప, యువరైతు, మాగనూర్

జాగ్రత్తలు తప్పనిసరి..



రైతులు వర్షాకాలంలో అనేక ప్రమాదాలకు గురవుతుంటారు. ముఖ్యంగా జాగ్రత్తలు తప్పనిసరి పాటించాలి. పొలాలకు వెళ్లే సమయంలో రైతులు చేతిలో కర్రతో చప్పుడు పెట్టుకుని శబ్దం చేస్తుండాలి. పాముకాటు ప్రమాదం తప్పుతుంది. మైనర్లకు ట్రాక్టర్లు ఇవ్వొద్దు, అనుభవం కలిగిన డ్రైవర్లతోనే పొలం పనులు చేయించుకోవాలి.

– సుదర్శన్‌గౌడ్, ఇన్‌చార్జి ఏఒ, మాగనూర్

విద్యుత్‌తో అప్రమత్తం..

వర్షాకాలంలో రైతులు, ప్రజలు విద్యుత్‌తో అప్రమత్తంగా ఉండాలి. ఇళ్ల, పొలాల వద్ద విద్యుత్ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలి.

- విద్యుత్ మరమ్మతుల సమయంలో టెస్టర్ వినియోగించాలి.
- వర్షం పడితే మోటార్లు తడవకుండా కప్పి ఉంచాలి.
- ఎర్తింగ్ ఏర్పాటు చేసుకోవాలి.
- విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, మోటార్లు, స్టార్టర్లు చుట్టూ పిచ్చి మొక్కలు, పొదలు ఉంటే తొలగించాలి. స్టార్టర్లు పొడి ప్రదేశంలో మాత్రమే అమర్చుకోవాలి. తడి చేతులతో విద్యుత్ పరికరాలను, స్విచ్చ్‌లను తాకొద్దు.
- విద్యుత్ సమస్యలుంటే సంబంధిత సిబ్బందికి తెలియాజేయాలి.

కొనసాగుతున్న 'ఉపాధి' సామాజిక తనిఖీ



ఉపాధి పనుల్లో అవినీతి చోటుచేసుకుందని అధికారుల దృష్టికి తీసుకొస్తున్న గ్రామస్తుడు

మద్దూరు: ఉమ్మడి మద్దూరు మండలంలోని 49 గ్రామ పంచాయతీల పరిధిలో గతేడాది ఏప్రిల్ 1నుంచి ఈ ఏడాది మార్చి 31వరకు జరిగిన ఉపాధి పనులపై గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో డీఆర్‌డీఏ పీడీ రాజేశ్వరీ, క్యాలిటీ కంట్రోలర్ చంద్రోశేఖర్, అంబుస్‌మడ్ నాగిరెడ్డి, ఎస్‌ఆర్‌పీలు బద్రినాథ్, మహిపాల్ ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ చేపట్టారు. ఉమ్మడి మండలంలో ఈ ఏడాది కాలంలో కూలీలకు రూ. 6కోట్ల 85లక్షల, 82వేల 557 రూపాయాలు, మెటీరియల్‌కు రూ.54లక్షల55 వేల 633రూపాయల పనులు సంబంధించిన సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లెర్లలో జరిగిన ఉపాధి పనులు ఎఫ్‌ఏ, ఉపాధి అధికారులు, పంచాయతీ సిబ్బంది కుమ్మక్కై అవినీతి పాల్పడినట్లు, పనిచేసిన కూలీలకు సక్రమంగా కూలీ డబ్బులు చెల్లించలేదని, గ్రామానికి చెందిన యువకులు అధికారులకు తనిఖీలో వెల్లడించారు. అలాగే మద్దూరు, దమ్‌గాస్‌పూర్, నందిపాడ్, దోరేపల్లి తదితర పెద్ద గ్రామాల్లో ఉపాధి పనుల్లో అవినీతి చోటుచేసుకుందని ఎస్‌ఆర్‌పీలు సామాజిక తనిఖీల్లో ఆధారాలతో వివరించారు. ఈ సామాజిక తనిఖీ 49జీపీలకు గాను ఇప్పటివరకు 18జీపీలు మాత్రమే పూర్తయినట్లు అధికారులు తెలిపారు. రాత్రి ఎంత వరకైనా పూర్తిచేస్తామని అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జయరాములు, ఏపీఓ సిద్దేశ్వర్, డీఆర్‌డీఏ సూపరింటెండెంట్ రాఘవులు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులు, చట్టాలపై అవగాహన

ఊట్కూరు: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం జిల్లా బాలల సంరక్షణ కో–ఆర్డినేరట్ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో బాలల హక్కులు, చట్టాలపై అవగాహన నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ బాల్యవివాహాలు చేసుకోవడంతో కలిగే ఇబ్బందులు, బాల్యవివాహాలు చేపడితే చట్టరిత్యా తీసుకునే చర్యల గురించి వివరించారు. పోక్సో చట్టం, చిన్న పిల్లలపై అఘాయిత్యం, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 ఉపయోగించే విధానం తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్స్‌పాల్ సత్యనారాయణ, సంతోష తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కో- ఆర్డినేటర్ శ్రావణ్‌కుమార్

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నారాయణపేట రూరల్: చేనేత కార్మికుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధి చూయించాలని బీజేపీ పార్లమెంట్ కో -కన్వీనర్ కెంచె శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మండలంలోని కోటకొండ బీజేపీ కార్యాలయంలో గురువారం చేనేత కార్మికుల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జీయో ట్యాగింగ్ పేరుతో రాష్ట్రంలో నేతన్నల సంఖ్య తక్కువగా చూయించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. చేనేత కార్మికులు సరియైన బతుకుదెరువు లేక కొట్టుమిట్టాడుతున్నారని వాపోయారు. ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరికాదన్నారు. వెంటనే చేనేత కార్మికులను ఆదుకునేందుకు తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాములు, నారాయణ, వెంకటయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కెంచె శ్రీనివాస్

షీటీంపై అవగాహన కలిగి ఉండాలి



నారాయణపేటలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ సునీత



అవగాహన కల్పిస్తున్న మహిళా సాధికరత సంస్థ ప్రతినిధులు

నారాయణపేట రూరల్: మహిళలు, బాలికలు తప్పకుండా షీటీంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని షీటీం ఇన్‌చార్జి ఎస్‌ఐ సునీత అన్నారు. గురువారం పట్టణంలోని నారాయణ పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. అమ్మాయిలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పని ప్రదేశాల్లో మహిళలు ఎవరైనా ప్రేమ పేరుతో వేధింపులకు పాల్పడితే వెంటనే డయల్ 100, మహిళా హెల్ప్‌లైన్ నంబర్ 8712670398కు కాల్‌చేసి ఫిర్యాదు చేయాలన్నారు. అనంతరం గుడ్, బ్యాడ్ టచ్ గురించి తెలియజేశారు. అదేవిధంగా సైబర్ నేరాల వలలో పడే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో షీటీం బృంద సభ్యురాలు బాలరాజు, నమీనా, చెన్నప్ప పాల్గొన్నారు.

మద్దూరు: జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో గురువారం మండలంలోని అమర్‌గఢ్ కాలనీలో బాల్య వివాహాలతో అనర్థాలు, అమ్మాయిలు చదివితే జరిగే ప్రయోజనాలను సంస్థ మెంబర్ స్వప్న ప్రజలకు వివరించారు. అలాగే సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే వృద్ధుల ఆశ్రమం, చిల్డ్రన్ హోం అనాథలకు ఆశ్రమం జిల్లా కేంద్రంలో ఉందని వివరించారు. అలాగే సైబర్ నేరగాళ్లపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎవరైనా బాలికలు చదువుకు దూరంగా అవుతున్నట్లు ఉంటే తమకు సమాచారం ఇవ్వాలని లేదా 1098కి ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలింగ్ సెంటర్ మెంబర్ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

'కల్యాణలక్ష్మి' చెక్కుల పంపిణీ



మరికల్‌లో చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మరికల్: కాంగ్రెస్ పేదల ప్రభుత్వమని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మండలంలోని మక్తల్ నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను గురువారం స్థానిక రైతు వేదిక వద్ద పంపిణీ చేశారు. ఈ మేరకు.. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉందన్నారు. అర్హులైన లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీత, ఆర్‌ఐలు శ్రీశైలం, సుధాకర్‌రెడ్డి, విండో చైర్మన్ వెంకట్రామారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు చెన్నయ్య, వీరన్న, నాయకులు విజయ్‌రెడ్డి, చంద్రోశేఖర్‌రెడ్డి, కృష్ణయ్య, హరీష్ పాల్గొన్నారు.

ఊట్కూరు: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి చేతుల మీదుగా కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆడపిల్లల పెళ్లిల విషయంలో తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బందులు పడొద్దని ఉద్దేశంతో ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదిముభారక్ పథకాలను చేపట్టినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ మమత, ఎంపీడీఓ ధనుంజయగౌడ్, కాంగ్రెస్ నాయకులు బాలకృష్ణారెడ్డి, చంద్రకాంత్‌గౌడ్, సూర్యప్రకాష్‌రెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలు పెంపొందించాలి..



మక్తల్‌లో మాట్లాడుతున్న ఏఎంఓ విద్యాసాగర్



మరికల్‌లో నాలుకపై బీజాక్షరాలు రాస్తున్న మఠాధిపతి మునీంద్ర శివాచార్య

మక్తల్: విద్యార్థుల అభ్యాసన, సామర్థ్యాలను పెంపొందించాలని ఏఎంఓ విద్యాసాగర్ ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం మండలంలోని కర్ని, జక్లేర్ పరిధిలో ఉపాధ్యాయులకు సమావేశాలు నిర్వహించారు. ఈ మేరకు.. పాఠశాల విద్యార్థులకు తెలుగు, గణితం, సైన్స్, ఇంగ్లిష్‌పై అవగాహన కల్పించాలని కోరారు. విద్యార్థుల సామర్థ్యాలు పెంపొందించాలని సూచించారు. విద్యార్థులకు క్రమశిణ సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధికారి భాను ప్రకాష్, జీహెచ్‌ఎం చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో గురువారం కాంప్లెక్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఏఎంఓ విద్యాసాగర్ హాజరై ఉపాధ్యాయులకు తగిన సలహాలు, సూచనలు అందించారు. ఈ విద్యా సంవత్సరంలో తీసుకోవాల్సిన చర్యలు, అదేవిధంగా విద్యార్థులు చిన్నప్పటి నుంచే నూతన ఆవిష్కరణలు చేసే విధంగా ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో భానుప్రకాష్, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు గణేష్‌సింగ్, కిషోర్, ఉపాధ్యాయులు అజయ్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలి


మరికల్: విద్యార్థులపై తల్లిదండ్రులు, గురువులు పెట్టుకున్న ఆశయాలను వమ్ము చేయకుండా మంచిపేరు ప్రతిష్టలు తీసుకొచ్చేలా చదవాలని కాశీ మఠం పరంపర హలకట్టి హిరేమట్ మఠాధిపతి మునీంద్ర, శివాచార్య మహాస్వామి అన్నారు. మండల కేంద్రంలోని ప్రతిభ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా మఠాధిపతి చిన్నారుల నాలుకలపై బీజాక్షరాలను రాశారు. అనంతరం విద్యార్థులకు ఉండాల్సిన లక్షణాలను వివరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ హన్మంతురెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీఎమ్మార్పీఎస్ సభకు తరలివెళ్లిన నాయకులు




మరికల్: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జరిగే టీఎమ్మార్పీఎస్ సభకు మండలం నుంచి నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు రామస్వామి, గోపాల్ మాట్లాడుతూ.. షెడ్యూల్ కులాల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన సభకు తరలివెళ్తున్నట్లు వారు తెలిపారు. ప్రభుత్వం తమ ప్రధాన సమస్యలను గుర్తించి పరిష్కరించాలన్నారు. తరలి వెళ్లిన వారిలో కృష్ణయ్య, శ్యాంసుందర్, నర్సింహులు, బాలకృష్ణ, రాజు ఉన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీ రిలే దీక్షలు



నారాయణపేట: జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్కు వద్ద తెలంగాణ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు గురువారంతో ఆరో రోజుకు చేరుకున్నాయి. ఈ మేరకు.. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, జిల్లా కార్యదర్శి బాల్‌రాం మాట్లాడారు.. జీఓ నంబర్ 10రద్దు చేయాలని, రూ.2 లక్షలు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

క్రీడా పాఠశాలకు విద్యార్థుల ఎంపిక



మక్తల్: తెలంగాణ క్రీడా పాఠశాల ఎంపిక పోటీలకు నాలుగో తరగతి ప్రవేశం కోసం మక్తల్ నుంచి 15మంది విద్యార్థులు ఎంపికైనట్లు విశ్రాంతి పీఈటీ గోపాలం గురువారం తెలిపారు. ఈ నెల 12న హకీంపేటలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడాపాఠశాల ఎంపిక పోటీలకు పంపిస్తామని విశ్రాంతి పీఈటీ గోపాలం తెలిపారు. విద్యార్థులు సర్టిఫికెట్లతో ఉదయం 7గంటలకు హకీంపేట క్రీడా పాఠశాలకు రిపోర్టు చేయాలని కోరారు. కార్యక్రమంలో పీఈటీలు రమేష్‌కుమార్, అంబ్రేష్ పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



అడిషనల్ కలెక్టర్ అశోక్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

నారాయణపేట రూరల్: ప్రభుత్వ శాఖల్లో పనిచేసి పదవీ విరమణ పొందిన రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మనోహర్‌గౌడ్, వకీల్ సంతోష్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించి అడిషనల్ కలెక్టర్ అశోక్‌కుమార్‌తో మాట్లాడారు. తమ వినతిపత్రం సీఎం రేవంత్‌రెడ్డి పేషీకి పంపించాలని విజ్ఞప్తి చేశారు. బకాయిపడ్డ 4డీఏలను వెంటనే విడదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సూర్యప్రకాష్, సత్యనారాయణ, అంబాజీ, వెంకట్రాములు, జయతీర్థ, బాలరాజు, భాస్కర్, శంకర్, మల్లికార్జున్, బుచ్చిరెడ్డి, రఘునాథ్‌రెడ్డి, అనంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

బురద మయంగా రోడ్డు



వడ్వాట్‌లో ప్రధాన రహదారిపై ఇలా

మాగనూర్: మండల పరిధిలోని వడ్వాట్–మందిపల్లి ప్రధాన రహదారిపై వర్షపు నీటితో రోడ్డు బురద మయంగా మారింది. దీంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో సర్పంచ్‌ల పదవీ కాలం ముగియంతో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వడ్వాట్‌లో పారిశుద్ధ్యలోపంతో పందులు, దోమల స్వైరవిహారం చేస్తున్నాయంటున్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాల్సిన గ్రామ ప్రత్యేక అధికారి, పంచాయతీ కార్యదర్శులు స్పందించకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

యువత చెడు వ్యసనాలకు బానిస కావొద్దు..



మాట్లాడుతున్న ఎండీ సలీం

నారాయణపేట రూరల్: పీవైఎల్ రాష్ట్రస్థాయి విద్య వైజ్ఞానిక శిక్షణ తరగతులను 13, 14వ తేదీలో మదిర పట్టణంలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం తెలిపారు. స్థానిక భగత్‌సింగ్ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. యువతను సక్రమ మార్గంలో నడిపించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని, యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా పెడ ధోరణుల నుంచి విముక్తి కలిపించాలన్నారు. సమస్యలపై పోరాటాలు చేస్తూ, ప్రశ్నించే చైతన్యాన్ని పెంపొందించాలన్నారు. పేదలకు ఉచితంగా నాణ్యమైన విద్యా, వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాము, బాలు, సాబీర్, ప్రతాప్ పాల్గొన్నారు.

ఎస్‌జీటీలను వెంటనే రిలీవ్ చేయాలి



కోస్గిలో హెచ్‌ఎం వెంకటేశ్వరికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు



మరికల్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

కోస్గి: ఉపాధ్యాయుల బదిలీలో సెకండ్ గ్రేడ్ టీచర్లను ఉన్న పాఠశాల నుంచి బదిలీ అయిన పాఠశాలకు వెంటనే రిలీవ్ చేయాలని తపస్ (టీపీయూఎస్) ఉపాధ్యాయ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం కోస్గి, గుండుమాల్ మండల శాఖల ఆధ్వర్యంలో ఎస్‌జీటీలు నల్లబ్యాడ్జిలతో నిరసన తెలిపారు. ఈ మేరకు.. పట్టణంలోని బహార్‌పేట బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వరికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో తపస్ మండల ప్రధాన కార్యదర్శి అనంతయ్య, సభ్యులు నాగరాజ్, రవితేజ, వెంకట్‌రాములు, శ్రీనివాస్, రవీంద్ర, మధులత, సునీత, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మరికల్: బదిలీ చేసిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేసి జాయిన్ చేసుకోవాలని గురువారం ఎంఈఓ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జిలతో నిరసన వ్యక్తం చేశారు. అంతకుముందు కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొన్న వీరు బదిలీ విషయంపై అధికారులతో చర్చించారు. వెంటనే తమకు బదిలీ చేసిన స్థానంలో జాయిన్ చేసుకోవాలని వారు నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.